క్లుప్తంగా

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి



లక్ష్మీపురం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందించే డాక్టర్లకు ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మహిళలను చిన్నచూపు చూడడం తగదన్నారు. సంఘం నాయకులు చింతల శ్రీనివాసరావు, ఐద్వా నగర కార్యదర్శి ఏ కల్యాణి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, ఐద్వా నగర అధ్యక్షురాలు జి.రమణ, ఎం.కృష్ణకుమారి, అంకమ్మ, శ్రావణి, రాణి, కుమారి పాల్గొన్నారు.

భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

లక్ష్మీపురం: రాష్ట్రంలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు ఈనెల28వ తేదీ విజయవాడలో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటి నుంచి 6వ తేదీ వరకు అధిక ధరలకు నిరసనగా ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అచ్యుతాపురం ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, నాయకులు పుప్పాల సత్యనారాయణ, బందెల నాసర్ జీ, షేక్ వలి, జంగాల చైతన్య, యస్వంత్ పాల్గొన్నారు. ఏపీసీఎల్‌సీ నాయకులు ఎన్.నరసింహారావు మృతదేహానికి శనివారం ఘన నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి వి.రమణ ఉన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో చంద్రికకు పతకాలు



మంగళగిరి: పవర్ లిఫ్టింగ్ పోటీలలో చంద్రిక ప్రతిభ చూపింది. ఈ నెల 20వ తేదీ నుంచి 25వ కోల్‌కతాలో నిర్వహిస్తున్న సీనియర్ నేషనల్ పోటీలు నిర్వహించారు. శనివారం పోటీలతో మహిళల 84 కేజీల విభాగంలో మంగళగిరి నుంచి బొల్లినేని చంద్రిక ఓవరాల్ బ్రాంజ్ మెడల్ ఇంటర్‌స్టేట్ సిల్వర్ మెడల్ సాధించినట్లు అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, కోచ్ షేక్ సంధానిలు తెలిపారు. స్కాట్ 250 కేజీలలో సిల్వర్ మెడల్ బెంచ్ ప్రెస్ 110 కేజీలు, డెడ్ లిఫ్ట్ 180 కేజీలు బ్రాంజ్ మెడల్, ఓవరాల్ 547 కేజీలు బ్రాంజ్ మెడల్ ఇంటర్ స్టేట్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన చంద్రికను అసోషియేషన్ ప్రతినిధులు అభినందించారు.

కృష్ణాకెనాల్ రైల్వే గేట్ వద్ద గుర్తు తెలియని మృతదేహం



లక్ష్మీపురం: కృష్ణాకెనాల్ రైల్వే గేట్ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఒక గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే జీఆర్పీ సీఐ అంజిబాబు తెలిపిన వివరాలు.. కృష్ణాకెనాల్ రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రైలు నుంచి జారీ పడినట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాక పోవడంతో గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. మృతుడు బిస్కెట్ కలర్ ఫ్యాంటు, లైట్ స్కై బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నట్లు వివరించారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు 9440627546, 9550523485 నెంబరులలో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. రైలుపేటలోని శ్రీలేఖ లాడ్జి నిర్వహించే పి. ఆదినారాయణ(40) ఆర్థిక ఇబ్బందులతో గత కొంత కాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. భార్య మల్లేశ్వరి అనారోగ్యంతో ఉండటంతో మనస్తాపానికి గురైన ఆదినారాయణ ఈనెల 23న లాడ్జిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి



తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని మా భవిష్యత్తు కోసం కష్టపడి వైద్య విద్య చదివిస్తున్నారు. సుదూరప్రాంతాల నుంచి వచ్చి పీజీలలో చేరి చదువుతున్నాం. కానీ కోల్‌కతా లాంటి ఘటనలు మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాయి. విద్యపై ప్రభావం చూపుతాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులలో ఆత్మవిశ్వాసం నింపాలి.

-ఐ.నిఖితా రెడ్డి, ఎయిమ్స్ విద్యార్థిని

కోల్‌కతా ఘటన ఆందోళనకు గురిచేసింది



కోల్‌కతాలో చోటుచేసుకున్న ఘటనతో వైద్య విద్యార్థులను ఆందోళనకు గురిచేసింది. ఘటనను వైద్య విద్యార్థినులు మాత్రమే కాకుండా మహిళా లోకంపై దాడి. దేశంలోని అందరూ ఖండించాలి. మహిళలు అన్న రంగాల్లో రాణిస్తున్నారు. అయినా ప్రభుత్వం ఉదాసీనత కారణంగానే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. లేకుంటే మహిళలకు మానసిక ధైర్యం కోల్పోయే ప్రమాదం ఉంది.

-ఎం.అంజిని, విద్యార్థిని

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కేఎల్పీ స్కూల్లో చిన్ని కృష్ణుడు, గోపికలతో ప్రిన్సిపాల్ రత్తయ్య



జైన్ హైస్కూల్లో విద్యార్థులతో ఎండీ మున్ను, కనకదుర్గ



భాష్యంలో.. కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులతో భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, వ్యవస్థాపకుడు కె.బసవపున్నయ్య, ఆర్.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య పాల్గొన్నారు.

జైన్ హైస్కూల్లో..

సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. పాఠశాల డైరెక్టర్ ఎండీ మున్ను, ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ పాల్గొన్నారు.

భాష్యం విద్యాసంస్థల్లో..

భాష్యం విద్యాసంస్థల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ మన సంస్కృతిపై గౌరవ భావం పెరుగుతుందని అన్నారు.

ఏ భాషాకైన జానపద సాహిత్యమే మూలం

మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి



మాట్లాడుతున్న మూర్తి

లక్ష్మీపురం: జానపద సాహిత్యం, కళలు ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వంగా అందుతాయని ప్రపంచంలోని ఏ భాషా సారస్వతానికైనా అందులోని జానపద సాహిత్యమే మూలమని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జానపద విజ్ఞానంలో కళలు ప్రధానమైన భాగమని సంగీతం, నత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళలన్నీ ఈ విభాగం కిందికే వస్తాయన్నారు. గ్రామీణులు, గిరిజనులు కాయ కష్టంతో ఉల్లాసం పొందటానికి, విజ్ఞానం, వినోదానికి ఆవిర్భవించిన సహజ కళలివి అన్నారు. ప్రజా గాయకుడు గని, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల జానపద సాంస్కతిక కళలకు ఐదు వేల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఒగ్గు కథ, మల్లన్న కథలు, బీరప్ప కథలు, యెల్లమ్మ కథలు తెలంగాణ ప్రాంతంలో బహుళ ప్రచారంలో ఉంటున్నాయన్నారు. అనంతరం రచయిత్రి సుజాత, బిళ్లా అశోక్, మల్లేశ్వరరావు, మొగిలి ప్రసంగించారు.

పశువులను తమ ఇంటి పరిసరాల్లో కట్టడి చేసుకోవాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆవులు, పందులను, గాడిదలను యజమానులు తమ ఇంటి పరిసరాల్లోనే కట్టడి చేసుకోవాలని, రోడ్ల మీదకు వదిలితే వాటిని నగరపాలక సంస్థ సిబ్బంది స్వాధీనం చేసుకుంటారని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గుంటూరు నగరంలో ప్రధాన రోడ్లపై ఆవులను సదరు యజమానులు ఇష్టానుసారంగా వదిలి వేయడం వలన వాహనదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని సమయాల్లో తీవ్ర ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని చెప్పారు. నగర పాలక సంస్థ ప్రధాన రోడ్ల మీద సంచరించు పందుల పెంపకందార్లు నగరపాలక సంస్థ నుంచి లిఖితపూర్వక అనుమతులు, లైసెన్లు కలిగి ఉండాలన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ చట్టం 1995 సెక్షన్ 255 ప్రకారం సొంత నివాసంలో ప్రజలకు ఇబ్బంది కలుగజేయు ప్రజా ఆరోగ్యానికి హానికరమైన ఎటువంటి జంతువులను తన నివాస, గృహ ప్రాంగణంలో కలిగి ఉండడానికి వీలులేదన్నారు. అటువంటి పందులు, ఆవులు, గాడిదలు, పెంపుడు కుక్కలు రోడ్ల మీదకు వస్తే వాటిని ప్రజారోగ్య దృష్ట్యా నగరపాలక సంస్థ సిబ్బంది స్వాధీనం చేసుకొని, నగరపాలక సంస్థ బందెల దొడ్డికి తరలించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే సదరు యజమానులకు జరిమానాలు విధించడం, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

బీసీల రిజర్వేషన్ల సాధనకు బీపీ మండల్ కృషి



బీపీ మండల్, పూలే చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న రత్నషీలా మణి

ఏఎన్‌యూ: మహాత్మా జ్యోతిరావ్ పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం బీపీ మండల్ జయంతి శనివారం నిర్వహించారు. తొలుత బీపీ మండల్ చిత్రపటానికి రెక్టార్ కె.రత్నషీలా మణి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. స్వరూపరాణి, మహాత్మా జ్యోతిరావ్ పూలే అధ్యయన కేంద్రం సంచాలకులు ఎం.త్రిమూర్తి రావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమావేశానికి మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం సంచాలకులు ఎం.త్రిమూర్తి రావు అధ్యక్షత వహించారు. రెక్టార్ రత్నషీలామణి మాట్లాడుతూ బి.పి. మండల్ బీసీల అభ్యున్నతి కోసం ఎంతగానో పాటుపడ్డారని రిజర్వేషన్లలో 27 శాతం బీసీలకు దక్కేటట్లు చేసిన ఘనత ఆయనదేనని చెప్పారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూపరాణి మాట్లాడుతూ బీసీలు రిజర్వేషన్ల ఫలాలు పొందుతున్నారంటే ఆ గొప్పతనం బి.పి. మండల్‌కే దక్కుతోందని పేర్కొన్నారు. సమావేశంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్, గాంధీ అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు వై.అశోక్ కుమార్, పీజే రత్నాకర్, డాక్టర్ కె.సోమ శేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దివ్యతేజోమూర్తి, డాక్టర్ సూర్య కామేశ్వరి, డీఈలు వెంకటేశ్వరావు, సుబ్బారావు, నాన్ టీచింగ్ బీసీ ఉద్యోగ సంఘ నాయకులు సాంబశివరావు, సాయిరాం, ప్రసాద్, శ్రీనివాస్, డిల్లేశ్వరరావు, కె.వి.సుబ్బారావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్ యాదవ్, మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ కోటి యాదవ్ పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ అధికారికి డాక్టరేట్



విమల్‌బాబు

నెహ్రూనగర్: విజ్ఞాన్ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవంలో లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ అధికారి విమల్‌బాబు డాక్టర్ పట్టా అందుకున్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 14 పత్రాలను సమర్పించారు. డాక్టరేట్ పట్టా అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని విమల్ బాబు పేర్కొన్నారు.

సెప్టెంబర్ 26 నుంచి నాటకోత్సవం



నగరంపాలెం: సెప్టెంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు నారా చంద్రబాబు నాటకోత్సవం(తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవం) నిర్వహించనున్నట్లు అభినయ థియేటర్ ట్రస్ట్ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. బ్రాడిపేట 4/17వ అడ్డరోడ్డులోని కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభినయ థియేటర్ ట్రస్ట్, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్తంగా శ్రీ వెంకటేశ్వరవిజ్ఞాన మందిరంలో మూడు రోజులపాటు నాటకోత్సవాలు జరుగుతాయని అన్నారు. ప్రతి రోజు రెండు నాటకాలు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ట్రస్ట్ సలహాదారులు జొన్నలగడ్డ శ్రీనివాస్ మాట్లాడుతూ నాటకాలు అంతరించిపోతున్న తరుణంలో కళలకు పూర్వవైభవం తేవాలన్నారు. ట్రస్టీలు క్రోసూరి సుబ్బారావు, గుంటుపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే సమర్థంగా నిర్వహించాలి



రాజకీయ పార్టీ నేతలతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో బీఎల్ఓలు ఇంటింటి ఓటరు సర్వే చేస్తున్నారని, కేంద్ర ఎన్నికల సంఘం నుంచి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు సర్వేలో పాల్గొని పరిశీలించవచ్చని తూర్పు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ), నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్-2025పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ స్టేషన్‌కు ఒకరిని చొప్పున బూత్ లెవల్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చని, వారు సర్వేని పరిశీలించవచ్చన్నారు. ప్రస్తుత క్యాంపెయిన్‌ని విజయవంతంగా చేపట్టడం ద్వారా రానున్న ఏ ఎన్నిక అయినా నగరంలోని 2 నియోజకవర్గాల నుంచి ఓటింగ్ శాతం పెంచడానికి వీలు కలుగుతుందన్నారు. సమావేశంలో ఈఆర్వో, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్వో, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మ, ఓంకార్ (టీడీపీ), డి.జాన్ బాబు (వైఎస్సార్ సీపీ), బి.సునీల్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), ఎస్.కార్తీక్ (సీపీఎం), టి.సేవా కుమార్ (ఆమ్ ఆద్మీ పార్టీ) పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో ఎక్కడా రాజీలేదని, తాగునీటి సరఫరాపై సమగ్ర నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ హెడ్ వాటర్ వర్క్స్‌ని పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. తొలుత హెడ్ వాటర్ వర్క్స్‌కి ప్రకాశం బ్యారేజ్ నుంచి ప్రతి రోజు ఎంత ముడి నీరు వస్తుంది, దాని ట్రీట్మెంట్, సరఫరా, క్లోరినేషన్, ఆలం మిక్సింగ్, నీటి శ్యాంపిల్స్ పరీక్షలు తదితర అంశాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో ఈఈ శ్రీనివాస్, డిఈఈ శ్రీధర్, ఏఈలు బాబర్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజులు చెల్లించని ప్రకటనల బోర్డులను తొలగించాలి

గుంటూరు నగరంలో అనధికార, ఫీజులు చెల్లించని ప్రకటనల బోర్డులకు సంబంధించి తొలగింపు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, రోడ్ల పక్కన ఆక్రమణల తొలగింపు వేగంగా చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో పట్టణ ప్రణాళిక అధికారులతో ప్రత్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో బకాయిలు చెల్లించని, అనధికార ప్రకటనల బోర్డ్‌ల తొలగింపు ప్రక్రియ వేగంగా చేపట్టాలన్నారు. ఫ్లెక్సీలు రోడ్ల మీద ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారని, వాటిని ఎప్పటికప్పుడు దళం బృందాల ద్వారా తొలగించాలన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీ మురళి, టీపీఎస్‌లు సువర్ణ కుమార్, లక్ష్మణ స్వామి, రసూల్, సర్వేయర్ లోకేష్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

పట్నంబజారు: రిజిస్ట్రేషన్ కార్యాలయంలోకి వెళ్లి డాక్యుమెంట్లు చించి, అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. డొంక రోడ్డుకు చెందిన లింగయ్యకి ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు శ్రీరామమూర్తికి తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు శనివారం సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి వచ్చారు. దీంతో మిగిలిన ఇద్దరు సుధాకర్, అంకయ్య ఆస్తిని పెద్ద కుమారుడికి ఎలా రాస్తావంటూ రిజిస్ట్రారు కార్యాలయంలోకి ప్రవేశించి కాగితాలు చించి వేసి అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. జాయింట్ రిజిస్ట్రారు -1 ఎం.విజయప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై..

పట్నంబజారు: వ్యక్తిపై దాడి చేసి కులం పేరుతో దూషించిన తండ్రి, కుమారుడిపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు ఏసుభక్తనగర్‌కు చెందిన సుంకరబాబు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. మిత్రులతో కలసి శనివారం విద్యానగర్‌లో స్థలాలు చూస్తున్న క్రమంలో ఆ ప్రాంతానికి చెందిన హరికృష్ణ, అతడి తండ్రి వెంకట్రావు మా స్థలాలు అమ్ముతావా అంటూ అతడిపై దాడికి పాల్పడ్డారు. కులం పేరుతో దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కండక్టర్ వద్ద నగదు మాయంపై..

పట్నంబజారు: ఆర్టీసీ బస్సు కండక్టర్ వద్ద ఉన్న నగదు మాయమైన ఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. డిపో-1 కండక్టర్‌గా పనిచేసే ఆదిలక్ష్మి, పిడుగురాళ్ల విధుల నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్నారు. ఐటీసీ వద్దకు వచ్చే సరికి తన బ్యాగులోని రూ.13 వేలు నగదు పోయినట్లు గుర్తించారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ, బృంద చర్చ అంశాల్లో జిల్లాస్థాయి వార్షిక పోటీలు నిర్వహించారు. ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చాటాలని సూచించారు. ఈ సందర్భంగా 12 మండలాల నుంచి ఒక టీంగా వ్యాసరచన, పది మండలాల నుంచి మరొక టీంగా బృంద చర్చలో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థి బృందాల్లో దుగ్గిరాల జెడ్పీ ఉన్నత పాఠశాల టీంను వ్యాసరచన, తెనాలిలోని ఎస్‌డీఐ మున్సిపల్ ఉన్నత పాఠశాల బృందాన్ని బృంద చర్చలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పర్యవేక్షణలో జరిగిన పోటీలకు ఉపాధ్యాయులు మంగారావు, నాగార్జున, పాప, వసుంధరా దేవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభించిన మంత్రి సత్యకుమార్



సత్యకుమార్‌ను సన్మానిస్తున్న మాగంటి

గుంటూరు మెడికల్: గుంటూరు లాలుపురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, కార్యశాల అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ సిద్ధాంత ప్రాతిపదికన సభ్యత్వ నమోదు చేసే పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. సంప్రదాయ పద్ధతుల్లో గతంలో సభ్యత్వ నమోదు చేసేవాళ్లం అన్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సభ్యత్వం నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, సభ్యత్వ నమోదు జిల్లా ప్రముఖ్ పాలపాటి రవికుమార్, నాయకులు సీహెచ్ తిరుపతిరావు, బి.చంద్రశేఖర్, వై.స్వరూపరాణి, డాక్టర్ శనక్కాయల అరుణ, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, కుమార్ గౌడ్, సుబ్బారావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సత్యకుమార్ సన్మానం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌ను శనివారం గుంటూరు బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి మాగంటి సుధాకర్‌యాదవ్ సన్మానించారు. శాలువా కప్పి, శ్రీకృష్ణుడి విగ్రహం బహూకరించారు.

అధికారం కోసమే కాంగ్రెస్ మతతత్వ పార్టీతో పొత్తు

గుంటూరు మెడికల్: జమ్మూ కాశ్మీర్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారం కోసమే మతతత్వ పార్టీ నేషనల్ కాన్ఫరెన్సుతో పొత్తుపెట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. శనివారం గుంటూరులోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ విభజన రాజకీయాలు చేస్తోందని, దేశ సమగ్రతకు భంగం కలిగించేలా కాంగ్రెస్ చేస్తున్నట్లు వెల్లడించారు. 370 ఆర్టికల్స్ తిరిగి తీసుకొస్తామని, నేషనల్ కాన్ఫరెన్సు చెబుతుందని పేర్కొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్‌కు ర్యాంకుల పంట



మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) శుక్రవారం ప్రకటించిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో టాప్-10లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఐదు ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. శనివారం బ్రాడీపేటలోని మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. మోహన్ మాట్లాడుతూ సీఎంఏ ఫైనల్‌లో అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచిన కొత్తపేట తేజస్వినితో పాటు పబ్బిశెట్టి జైమిత్ర 3వ ర్యాంకు, శ్రీథాష్ ఇందుపూరి 8వ ర్యాంకు సాధించారని వివరించారు. ఈ విధంగా అఖిల భారతస్థాయిలో 50లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు 14 మంది ఉన్నారని చెప్పారు. అదే విధంగా సీఎంఏ ఇంటర్‌లో మొదటి 50లోపు ర్యాంకుల్లో మున్నంగి వెంకట లక్ష్మీనారాయణ 3వ ర్యాంకు, పక్షల్ జైన్ 9వ ర్యాంకుతో పాటు ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు 25 మంది ఉన్నారని వివరించారు. సీఎంఏ ఫైనల్, సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో అఖిల భారతస్థాయి టాప్-50లో ఐదు ర్యాంకులతో పాటు మొదటి 50 ర్యాంకుల్లో 39 ర్యాంకులను సాధించినట్లు చెప్పారు.

అలరించిన శ్రీకృష్ణ సంకీర్తన గానలహరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం భక్త నారద గానసభ నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన సందర్భంగా డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య, శ్రీకృష్ణ సంకీర్తన గానలహరి చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆకురాతి కోదండ రామయ్య తమ గాత్రధారణలో శుక్లాం భరధరం విష్ణుంతో ప్రారంభించగా, రాధాసమేత కృష్ణ, సతులాల చూడరే, ముద్దుగారే యశోద, పాహి పాహి మోహన కృష్ణ, కృష్ణ కలయ సఖి సుందరం, అని ఆనతించే కృష్ణుడు అర్జున అంటూ పలు శ్రీకృష్ణ సంకీర్తనలు ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయశాస్త్రి, తబలపై చిట్టిబాబు వాయిద్య సహకారం అందించారు.

చరిత్ర అధ్యాపకుడు ఎన్వీ నరసింహారావు మృతి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రముఖ చరిత్ర అధ్యాపకుడు, సామాజిక కార్యకర్త ఎన్వీ నరసింహారావు శనివారం మృతి చెందారు. కొరిటిపాడులోని నివాసంలో ఆయన భౌతిక కాయాన్ని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, విరసం నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్, ఏపీ చరిత్ర కాంగ్రెస్ నాయకుడు ఎం.సోమశేఖరరావు, పౌర హక్కుల సంఘ నాయకుడు చిలకా చంద్రశేఖర్ సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు జిల్లా చరిత్ర కాంగ్రెస్‌ను స్థాపించినట్లు చెప్పారు. 30 ఏళ్లుగా చరిత్ర అధ్యాపక ప్రాముఖ్యాన్ని ప్రచారం చేయడంతో పాటు గుంటూరు జిల్లా చరిత్రపై రెండు వ్యాల్యూమ్స్ ప్రచురించారని తెలిపారు. చరిత్ర అధ్యాపకునిగా అనేక ప్రాంతాల్లో పని చేసి, విద్యార్థుల్లో చరిత్రపై ఆసక్తి కలిగించారని చెప్పారు. సామాజిక అసమానతలను వ్యతిరేకిస్తూ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని కొనియాడారు.